క్లుప్తంగా

పిల్లలకు తండ్రే నిజమైన హీరో



మాట్లాడుతున్న ఆదిత్య విశ్వవిద్యాలయం చాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి

కంబాలచెరువు: పిల్లలకు తమ తండ్రే నిజమైన హీరో అని ఆదిత్య విశ్వవిద్యాలయం చాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. స్థానిక ఆదిత్యక్ష్ ఇంటర్నేషనల్ స్కూలులో శనివారం ఫాదర్స్ డే నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ కర్రి రామారెడ్డి హాజరై మాట్లాడారు. పిల్లలకు విలువతో కూడిన విద్యను అందిస్తూ, మంచి నడవడికను పెంపొందించే బాధ్యతను గురువులు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణులు చక్రధర్, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీవీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కడియం: మండల కేంద్రమైన కడియానికి చెందిన పలువురు రైతులకు ధాన్యం డబ్బులు ఇంకా రాలేదని కలెక్టర్ కార్యాలయంలో శనివారం బీజేపీ, జనసేన పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. తక్షణం రైతులకు రావాల్సిన బకాయిలను అందించాలని కోరారు.

తోపుడు బండి వితరణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక 19వ డివిజన్ కన్నమ్మతల్లి గుడి వీధికి చెందిన దోమరాజు రాధ అనే చిరు వ్యాపారికి జీఎస్ఆర్ హాస్పిటల్స్ అధినేత గోరంట్ల రవి రామ్ కిరణ్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువైన తోపుడు బండిని అందించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కుమార్తె కంఠంనేని శిరీష చేతుల మీదుగా ఆయన నివాసంలో శుక్రవారం రాత్రి రాధకు అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

రాజమహేంద్రవరం రూరల్: విద్యాశాఖలో పేరుకుపోయిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీఎస్ రెడ్డి, ఐ.విష్ణుమూర్తి శనివారం ప్రకటనలో కోరారు. డీఎస్సీని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురికి ఉద్యోగాలు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఎంఎస్ఎన్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే శనివారం తెలిపారు. ఇంటర్వ్యూలకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారన్నారు. వారికి రాత పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, మసిల్ టెస్ట్, మౌఖిక పరీక్షలను కంపెనీ ప్రతినిధులు ఎన్.శ్రీహరి, కె.శంకర్, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్ నిర్వహించారన్నారు.

నేడు ఎంపీ పురందేశ్వరి రాక

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం నగరానికి రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తెలిపారు. ఆమె ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మూడు రోజుల పాటు జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని కోస్టల్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటారన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కంబాలచెరువు: స్థానిక 50వ డివిజన్ లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులతో పాటు హెచ్ఎం అంకం మల్లేశ్వరరావు, సరితారం జని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	హరోంహర
సూర్యమినీ	చందు చాంఫియన్
సూర్యప్యాలెస్	హరోంహర
స్వామి	మహారాజ
శివజ్యోతి	యేవమ్, సత్యభామ
అనుశ్రీ	మనమే
రాజా	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	రాజధాని రౌడీ
రంభ	ఇంద్రాణి
మేనక	సత్యభామ
అప్సర	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	మ్యూజిక్ షాప్ మూర్తి

నామవరం

వీఎస్ మహల్	హరోంహర

ధవళేశ్వరం

మురళీకృష్ణ	మ్యూజిక్ షాప్ మూర్తి

కడియం

వెంకటసూర్య	హరోంహర

తుప్పలతో తిప్పలే..

- చిట్టడవిగా మారుతున్న ఖాళీ స్థలాలు
- నిల్వ నీటిలో పెరుగుతున్న దోమలు
- చుట్టుపక్కల ప్రజల అవస్థలు
- సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ చర్యలు



పిచ్చిమొక్కలతో చిట్టడవిగా మారిన ఖాళీ స్థలం



నగరంలోని ఓ ప్రాంతంలో ఖాళీ స్థలం దుస్థితి



ప్రహరీ లోపల పెరిగిపోయిన తుప్పలు

రాజమహేంద్రవరం సిటీ: నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. జనాభా విపరీతంగా పెరుగుతోంది. విద్య, వ్యాపారం, ఉద్యోగం, బతుకుతెరువు కోసం అనేక మంది నగరబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరంలోని స్థలాలపై చాలామంది పెట్టుబడులు పెడుతున్నారు. ఖాళీ స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. మంచి ధర పలికిన తర్వాత వాటిని విక్రయించాలని చూస్తున్నారు. అయితే ఆ ఖాళీ స్థలాల వల్ల కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయి. వాటిలో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోతున్నాయి. పల్లంగా ఉండడంతో నీరు నిల్వ ఉండి చుట్టుపక్కల నివసిస్తున్న వారికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి రాజమహేంద్రవరం కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. నగరంలో ఖాళీ స్థలాలు ఉన్న యజమానులు.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే వాటిలో తుప్పలు తొలగించాలని, వాటిలో నీరు నిల్వ లేకుండా మెరకు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

అన్ని డివిజన్లలోనూ..

నగరంలోని 50 డివిజన్ల పరిధిలో అనేక ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిని గతంలో కొనుగోలు చేసి అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఈ స్థలాలలో తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. అలాగే చుట్టుపక్కల భవనాలు, అపార్టుమెంట్లు రావడంతో ఇవి పల్లంగా మారాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడు ఈ ఖాళీ స్థలాలలో నీరు నిలిచిపోతోంది. వాటిలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పందులు కూడా సంచరిస్తున్నాయి. చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాటి వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. వేసవి కాలంలో బాగానే ఉన్నా వర్షాకాలంలో మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

5500 ఖాళీ స్థలాల గుర్తింపు

నగరంలో ఇలాంటి 5500 ఖాళీ స్థలాలను నగరపాలక సంస్థ అధికారులు గుర్తించారు. వాటి వల్ల చుట్టుపక్కల వారు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆ ఖాళీ స్థలాల యజమానుల ఆచూకీ దొరకక పోవడంతో చుట్టుపక్కల ప్రజలకు విషయం తెలిపారు. వెంటనే ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి, మెరక చేసుకోవాలని యజమానులకు తెలపాల్సిందిగా కోరారు. స్థలాల యజమానులు పట్టించుకోకపోతే చర్యలు చేపడతామని హెచ్చరించారు. నగరంలోని లాలాచెరువు, వీఎల్ పురం, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, కోకా భాస్కరమ్మ నగర్, శ్రీ నగర్, శ్రీనివాస నగర్, రెవెన్యూ కాలనీ, షణ్ముఖ నగర్, గాంధీపురం-4, మోడల్ కాలనీ, జేఎన్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు, చోడేశ్వరనగర్, విద్యుత్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, భాస్కర నగర్, సీటీఆర్ఐ ఏరియా, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాలలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి.

> **తుప్పలు తొలగించకపోతే చర్యలు**
>
> 
>
> ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన తుప్పలను యజమానులు తక్షణమే తొలగించాలి. నగరంలో సుమారు 5500 ఖాళీ స్థలాలు ఉన్నట్లు క్షేత్ర స్థాయి అధికారులు అంచనా వేశారు. ఆ స్థలాల చుట్టు పక్కల నివాసం ఉండే వారు.. ఆయా యజమానులకు విషయం తెలియజేయండి. తుప్పలు తొలగించకపోతే చర్యలు తప్పవు.
>
> – దినేష్ కుమార్, కార్పొరేషన్ కమిషనర్, రాజమహేంద్రవరం

వృద్ధులకు మరిన్ని వసతులు కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రసాదరావు

ప్రకాశం నగర్: సమాజంలో వేధింపులకు గురవుతున్న వృద్ధుల కోసం ప్రత్యేక ట్రిబ్యూనల్‌ను ఏర్పాటు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఏబీ నాగేశ్వరరావు పార్కులోని సీనియర్ సిటీజన్ డేకేర్ భవనంలో శనివారం సాయంత్రం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ సంక్షేమ వేదిక అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్ అధ్యక్షత వహించగా, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజినీర్ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులకు ఆదాయపు పన్ను ఎత్తివేయాలని, రైల్వేలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, మరిన్ని వసతులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహాకవి శ్రీశ్రీకి నివాళి

ప్రకాశం నగర్: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్త నిర్వహణలో శనివారం మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నన్నయ వర్సిటీ ఆచార్యులు టి.సత్యనారాయణ మాట్లాడుతూ నవ్య కవిత్వానికి బాటలు వేసి, అభ్యుదయ కవిగా శ్రీశ్రీ నిలిచారన్నారు. సభకు ప్రిన్సిపాల్ ఎబిల్ రాజబాబు అధ్యక్షత వహించారు.

10,450 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



రాజానగరంలో పట్టుబడిన రేషన్ బియ్యం

రాజానగరం: అక్రమంగా తరలిస్తున్న 10,450 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రాజానగరంలో పట్టుకున్నారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు స్థానిక జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా పెదవేగికి చెందిన ఉప్పల ప్రకాష్‌కు చెందిన ఐషర్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, 6ఏ కేసు నమోదు చేశారు. వాహన యజమానితో పాటు డ్రైవర్ కొత్తపల్లి నాగరాజుపై కూడా కేసు నమోదు చేశారు. ఈ అక్రమ రవాణాకు అసలు కారకులెవరనే విషయం ఆరా తీస్తున్నామని, దీనికి కారకులైన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదవుతాయని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10,75,475గా అంచనా వేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవ మహేష్, లోవరాజు, శివ, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ దివాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో డీఈఈ సెట్–2024 మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలనకు మూడో రోజైన శనివారం 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఏఎం జయశ్రీ ఈ విషయం తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అభ్యర్థులకు తుది అడ్మిషన్ లెటర్ ఇచ్చామన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ మాధవి

పెదపూడి: వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మాధవి హెచ్చరించారు. మండలంలోని పెదపూడి, దోమాడ గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల షాపులలో రికార్డులు, సరుకు నిల్వలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల వద్ద విత్తనాల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు 100 గింజలు తీసుకుని ముందుగా మొలకశాతం కట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తనిఖీ చేసిన షాపులలో విత్తనాలు బస్తాల నుంచి శాంపిల్లు సేకరించారు. మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్, సుధా మాధురి పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డి సేవలు అభినందనీయం



విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మానవతావాది టీకే విశ్వేశ్వరరెడ్డి సేవలు అభినందనీయమని పేపర్ మిల్లు ఆఫీసర్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎస్పీఎస్ దొర కొనియాడారు. రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డికి ఇటీవల డాక్టరేట్ వచ్చిన సందర్భంగా శనివారం స్థానిక పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో అభినందన సత్కారం నిర్వహించారు. దొర మాట్లాడుతూ పేపర్‌మిల్లులో ఇంజినీర్‌గా పనిచేసిన విశ్వేశ్వరరెడ్డి అటు ఆఫీసర్స్ అసోసియేషన్‌ను ముందుకు నడుపుతూనే, మరో వైపు పేపర్ మిల్లు కార్మికుల హక్కుల కోసం పాటుపడ్డారని ప్రశంసించారు. సన్మాన గ్రహీత విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ కాలుష్య గోదావరి నీటిని పరిశుభ్రమైన తాగునీరుగా మార్చేందుకు నిరంతరం పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్వీ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సీహెచ్ఎస్ వీరభద్రం, కోశాధికారి బి.అప్పారావు, కె.సుధాకర్ పట్నాయక్, ఎస్.అప్పారావు, ఫణీంద్రరావు పాల్గొన్నారు.

జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి శివకుమార్

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో శనివారం జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివ కుమార్ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. ఈ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారు చట్టానికి జవాబుదారులు అవుతారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ నల్సా వారి చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ అండ్ దేర్ ప్రొటెక్షన్ యాక్ట్ గురించి వివరించారు. ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ జానీబాషా మాట్లాడుతూ పోలీసు అధికారులకు జువైనల్ జస్టిస్ యాక్ట్ నిబంధనలు, ఈ కేసులను ఏ విధంగా త్వరితగతిన పూర్తి చేయాలో వివరించారు. 3వ అదనపు జుడీషియల్ మెజిస్ట్రేట్ సి.రమ్య మాట్లాడుతూ పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారుల విధులను తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, దిశ వుమెన్ పోలీసు స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.ఆదినారాయణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు తబిత పాల్గొన్నారు.

వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించొద్దు



వెంకాయమ్మపేటలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్

కడియం: గ్రామాల్లో వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించవద్దని ప్రజలకు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ విజ్ఞప్తి చేశారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు ధ్వంసం చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ తులసీధర్, ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ శనివారం వెంకాయమ్మపేట గ్రామస్తులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసారు. తులసీధర్ మాట్లాడుతూ ఎవరు ఏ పార్టీలో ఉన్నా గ్రామ ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని, ఒక పార్టీకి చెందిన వ్యక్తులు కట్టిన ఫ్లెక్సీలను మరో పార్టీకి చెందిన వారు ధ్వంసం చేయడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ నిఘా ఉంచామని, ఇటువంటి ఘటనలకు ఎవరైనా పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫెర్టీ–9 ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న వినేష్ గాధియా తదితర ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని తిరుపతి, రాజమహేంద్రవరాలలో ఫెర్టీ–9 సంస్థ శనివారం రెండు ఫెర్టిలిటీ క్లినిక్‌లను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ వినేష్ గాధియా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో దశాబ్దానికి పైగా ఏడు సంతానోత్పత్తి కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన కొత్త కేంద్రాలతో మరింత మందికి సేవలు అందించే వీలు కలిగిందన్నారు. తమ క్లినిక్‌లలో అధునాతన పునరుత్పత్తి సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. ఏపీ, తెలంగాణ మార్కెట్లలో తాము అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐవీఎఫ్ చైన్‌గా ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. మరిన్ని జంటలకు తల్లిదండ్రులయ్యే కలను సాకారం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఫెర్టీ–9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ తిరుపతి, రాజమహేంద్రవరాలలో సమర్థవంతమైన చికిత్స ప్రణాళికలను అందించడానికి తమ బృందం సిద్ధంగా ఉందని తెలిపారు. భద్రత, పారదర్శకత, కారుణ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సహాయక సంతానోత్పత్తి చికిత్సలలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తామన్నారు. రాజమహేంద్రవరం సెంటర్ ఫెర్టిలిటీ కన్సల్టెంట్ డాక్టర్ సౌమ్య వరుదు మాట్లాడుతూ అధునాతన సాంకేతికతతో సేవలు అందిస్తామని తెలిపారు..

సమస్యల రహిత నగరమే లక్ష్యం



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సమస్యలు లేని నగరంగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కంబాల చెరువు వద్ద మేజర్ డ్రైనేజీలో చేపట్టిన పూడికతీత పనులను నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యకర రాజమహేంద్రవరం నినాదానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని మేజర్, మైనర్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తీయించే పనులు చేపట్టామన్నారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్, పుష్కరాల రేవు తదతర ప్రాంతాల్లోని డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే త్వరలో నగరంలో మూడు అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. క్వారీ సెంటర్లో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను అయన పరిశీలించారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం



అఖండ బిల్వార్చన చేస్తున్న పండితులు



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం చక్రద్వారబంధానికి చెందిన నాగవరపు రామకృష్ణ దంపతులచే నరేంద్రపురానికి చెందిన వేద పండితుడు దీక్షితులు శ్రీరామ్ ఆధ్వర్యంలో అఖండ బిల్వార్చన జరిగింది. తొలుత బాబా ఉత్సవ విగ్రహానికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. రాజానగరంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, వార్షికోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్న హారతి, అన్నసమారాధన నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలోని అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి తులసి, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: దాడి ఘటనపై బొబ్బిల్లంకకు చెందిన కొల్లి శివ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోడదాసి చిన్నాపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. శివకుమార్‌ను అతడి స్నేహితుడు చిన్నా మద్యం కొనుగోలు చేయడానికి డబ్బులు అడిగాడు. అయితే మద్యం షాపు వద్ద తన పేరు చెప్పి శివ కుమార్ బదులిచ్చాడు. దీంతో ఘర్షణకు దిగిన చిన్నా ఇనుప ఊచతో శివకుమార్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో శివకుమార్ చేతికి గాయమైంది.

ఈదురు గాలులతో భారీ వర్షం

- నేలకొరిగిన చెట్లు
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



చినకొండేపూడి - పెదకొండేపూడి రోడ్డుపై కూలిన చెట్టు



చినకొండేపూడి - చీపురుపల్లి రోడ్డుపై నేలకొరిగిన చెట్టు, విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వాటికి భారీ వర్షం తోడవ్వడంతో ప్రజలు ఆందోళన చెందారు. గాలి వేగానికి రోడ్డు మీద కూడా నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. శనివారం ఉదయం వాతావరణం మబ్బుగా ఉన్నా ఉక్కపోత ఎక్కువైంది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. సాయంత్రం 4.30 నుంచి 5 గంటల మధ్య విపరీతమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. చినకొండేపూడి – పెదకొండేపూడి, చినకొండేపూడి – చీపురుపల్లి రోడ్డులో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చిన కొండేపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ నిలిచిపోయింది. మండలంలోని పలు గ్రామాలలో సరఫరా ఆగిపోయింది. వర్షం కురవడంతో రైతులు పొలాలను దుక్కు చేయడానికి ట్రాక్టర్లపై బయలుదేరగా, రోడ్లపై చెట్లు పడిపోవడంతో ఎక్కడి ఆగిపోయారు. అలాగే ఆ దారిలో వెళ్లే వాహనాలు కూడా నిలిచిపోయాయి. విద్యుత్ ఏఈ చంద్రమోహన్ తన సిబ్బందితో యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

పండ్ల తోటలకు నష్టం

ఈదురుగాలుల కారణంగా మండలంలో పండ్ల తోటలకు నష్టం కలిగింది. ఆఖరి దశలో ఉన్న మామిడి తోటలు దెబ్బతిన్నాయి. జీడిమామిడి, సపోటా చెట్ల కాయలు రాలిపోయాయి.